క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, మండల అధికారులు తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

గడివేముల: బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వాసుదేవగుప్తా తెలిపారు. నెట్ సెంటర్ లేదా సచివాలయంలో ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో తీసుకెళ్లి ఫిబ్రవరి 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: మండలంలోని బీసీ, ఈబీసీ వర్గాల వారు స్వయం ఉపాధి కింద ఆర్థిక సహాయం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 3 కేటగిరీలలో 52 యూనిట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం సబ్సిడీ కింద బ్యాంకుల ద్వారా రూ.1.50 కోట్లు రుణం పొందేందుకు యూనిట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందులో రూ.50.25 లక్షలు సబ్సిడీ పోను, మిగతా రూ. 50.25 లక్షలు బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేస్తారని తెలిపారు. మొదటి కేటగిరీలో రూ. 2 లక్షల వరకు, రెండో కేటగిరీలో రూ.2 నుంచి రూ. 3 లక్షల వరకు, మూడో కేటగిరీలో రూ.3–5 లక్షల వరకు యూనిట్ విలువగా ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. ఆయా కేటగిరీల్లో అర్హులైన అభ్యర్థులు ఫిబ్రవరి 7వ తేదీలోగా ఓబీఎంఎంఎస్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



సచివాలయ ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

కల్లూరు: గ్రామ సచివాలయ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి హెచ్చరించారు. గురువారం బస్తిపాడు, బొల్లవరం, పుసులూరు గ్రామ సచివాలయాలను పరిశీలించారు. ఆయా సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించి ఎంఎస్ఎంఈ, హౌస్ హోల్డ్ జియోట్యాగ్, పెన్షన్ మ్యాపింగ్ తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే సచివాలయంలో రికార్డులు, రిజిస్టర్లు, హాజరు పట్టిని చూశారు. చెత్త సంపద కేంద్రాలను పరిశీలించి చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈఓఆర్డీ నాగేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



గోకులం షెడ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: ఉపాధిహామీ పనులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. గురువారం మారందొడ్డి గ్రామంలో ఆమె పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ.. ఉపాధి పనులకు సంబంధించి రోజువారి గరిష్ట వేతనం రూ.300 వరకు ఉందని, నిర్ణీత కొలతలతో పనులు చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన గోకులం షెడ్డును పరిశీలించారు. కూలీలకు త్వరితగతిన వేతనాలు వచ్చేలా చూడాలని ఉపాధి హామీ జేఈ రంగస్వామిని ఆదేశించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకులు

పాణ్యం: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి పేద, మధ్యతరగతి వర్గాలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు నాగరాజు, నరసింహ, బాలవెంకట్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత గురువారం పాణ్యం చేరుకుంది. అదానితో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి సర్‌చార్జీలు, ట్రూ అప్ చార్జీలు తగ్గించాలన్నారు. ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భద్రత కరువు

- ఏటీఎంల వద్ద కనిపించని సెక్యూరిటీ గార్డులు
- తరచూ సాంకేతిక సమస్యలతో తిప్పలు



గడివేములలోని ఎస్‌బీఐ ఏటీఎంలు

గడివేముల: వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు పట్టణ, గ్రామాల్లో బ్యాంకులు పోటాపోటీగా ఏటీఎం కేంద్రాలు ఏర్పాటు చేశాయి. కానీ వాటి నిర్వహణను మాత్రం గాలికి వదిలేస్తున్నాయి. గడివేముల మండలంలో ఏటీఎంల నిర్వహణ అత్యంత దారుణంగా ఉంది. మండల పరిధిలో మూడు బ్యాంకులు ఉన్నాయి. వాటి పరిధిలో సుమారు 5కిపైగా వివిధ రకాల బ్యాంకుల ఏటీఎం కేంద్రాలు ఉన్నాయి. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఏటీఎంలో నిత్యం రూ.లక్షలు డ్రా చేస్తుంటారు. కానీ కేంద్రాల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయడం లేదు. మిషన్‌లో డబ్బులు పెట్టి ఆ తరువాత వాటి భద్రతను గాలికి వదిలేస్తున్నారని.. కనీసం వాటిని పట్టించుకున్న దాఖలాలు కన్పించడం లేదని వినియోగదారులు అంటున్నారు. ప్రతి రోజూ లక్షలు డ్రా చేసే కేంద్రాల వద్ద కనీసం సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద భద్రత కల్పించాల్సిన బాధ్యత సంబంధిత బ్యాంకులపైనే ఉంది. అయినా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో తెలియడం లేదని వాపోతున్నారు. భద్రత ఏర్పాటు చేస్తే బాగుంటుందని హితవు పలుకుతున్నారు.

తరచుగా సాంకేతిక సమస్యలు

ఏటీఎం కేంద్రాల్లో చాలా వరకు ఏసీలు పనిచేయడం లేదు. ఆర్థిక భారం పడుతుందని బ్యాంకులు ఇలా చేస్తున్నాయనే విమర్శలూ వినిపిస్తున్నాయి. ఇలాగే ఉంటే రానున్న వేసవిలో ఇబ్బంది తప్పదు. అలాగే ఎప్పుడు చూసినా సాంకేతిక కారణాలతో పని చేయడం లేదనో, ఏటీఎంలో నో మనీ అంటూ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు అంతా ఏటీఎంలలోనే అధికంగా నగదు డ్రా చేస్తుంటారు. నెల మొదటి వారంలో ఉన్న ఏటీఎం సెంటర్లకు తిరిగినా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. ఎక్కువ శాతం ఏటీఎం కేంద్రాల వద్ద నగదు లేదు అని, ఔట్ ఆఫ్ సర్వీస్‌లని బోర్డులు దర్శనమిస్తుండడంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు.

మహాత్మాగాంధీకి నివాళి





గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్, నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారిణి

కోడుమూరు రూరల్: మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, సర్పంచ్ భాగ్యరత్న తమ సిబ్బందితో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోలోకొటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి మదన్‌శేఖర్ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ రామాంజినేయులు, ఈఓ అజయ్‌భాస్కర్, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, శానిటర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

ఓర్వకల్లు: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం వాడవాడలా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మండలంలోని నన్నూరు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి కౌసల్య ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. స్వాతంత్ర్య సాధనకు గాంధీజీ చేసిన అహింసా పోరాటం,ఉద్యమాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని సత్కరిస్తున్న ప్యాలకుర్తి నాయకులు

కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన ఎస్.బందెనవాజ్ వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. తన ఎంపికకు కృషి చేసిన కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని గురువారం కోడుమూరులో కలిసి పూలమాల, దుశ్శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కోట్ల హర్ష మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు పూర్తవుతున్నా, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేమంటూ సీఎం చంద్రబాబు రోజుకో విధంగా మాట్లాడుతూ ప్రజలను పక్కదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేను నాడు తప్పుబట్టిన కూటమి ప్రభుత్వం నేడు అదే సర్వేను తిరిగి ప్రారంభించడంతో ప్రభుత్వ మోసకారి తనం బయటపడిందన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో కరెంట్ చార్జీలను భారీగా పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారన్నారు. మరోవైపు రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా భారీగా పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని, కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలతో కలిసి పోరాడేందుకు సిద్ధమవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రామక్రిష్ణారెడ్డి, ఎంపీటీసీ సందప్ప, మాజీ సర్పంచ్ రంగన్న, పోలీస్ ఖాజా, రఫీ, క్రిష్ణ, సుధాకర్, జలీల్, బందెనవాజ్, శివుడు, నజీర్, పర్ల హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలోని లోపాలపై పోరాటం చేయండి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కాటసానిని సత్కరిస్తున్న విద్యార్థి విభాగం నాయకులు



కాటసానిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కల్లూరు: విద్యా వ్యవస్థలోని లోపాలపై విద్యార్థి సంఘాలతో కలిసి పోరాటం చేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు.వైఎస్సార్‌సీపీ పాణ్యం నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమితులైన రాకేష్, ఐటీ విభాగం అధ్యక్షుడు శివకృష్ణారెడ్డితో పాటు యువకులు, విద్యార్థులు గురువారం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని శివనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. విద్యా సమస్యలపై విద్యార్థుల తరుపున ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎ.హనుమంతురెడ్డి, విద్యార్థి నాయకులు సాయి కుమార్, గిరీష్, రంగన్న, బాలరాజు, భాస్కర్ నాయుడు, సురేంద్ర, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి

ఓర్వకల్లు: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా ఎంపికైన వారు బాధ్యతాయుతంగా పనిచేయాలని కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. పాణ్యం నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడిగా ఓర్వకల్లుకు చెందిన జి. వెంకటశివకృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా కాటసానిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నాయకులు కాశిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, చెన్నూరు నాగలింగేశ్వరరెడ్డి, తోట లక్ష్మిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, ఉస్మాన్‌బాషా, ఎద్దుల ప్రవీణ్‌కుమార్ రెడ్డి, కాంతయ్య, ప్రవీణ్‌కుమార్, ప్రభు, అనీల్, సతీష్, వార్డు సభ్యులు రాజేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల్లో కూలీలందరికి ఉపాధి పనులు



వర్కూరులో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కోడుమూరు రూరల్: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. గురువారం సాయంత్రం మండలంలోని వర్కూరు, పులకుర్తి గ్రామాల్లో ఎంపీడీఓ రాముడు పర్యటించి కూలీలతో మాట్లాడారు. వలసల నివారణకు అడిగిన వారందరికీ ఉపాధి పథకం కింద పనులు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజు వారి వేతనం రూ.300 వరకు వస్తుందని.. కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సూచించారు. అలాగే ఉపాధి సిబ్బంది కూడా గ్రామాల్లో పర్యటించి పనులు అవసరమైన కూలీల వివరాలను నమోదు చేసుకుని వారికి వెంటనే పనులను కల్పించాలని ఎంపీడీఓ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ట్రాక్టర్‌ను ఢీకొనడంతో బోల్తాపడిన కోళ్ల వాహనం

ఖాజీపేట: ఆంజనేయకొట్టాలు నుంచి బద్వేలుకు వెళ్లే రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు.. వివరాలిలా.. కదిరి, రాయచోటి, కడప నుంచి కోళ్ల వ్యర్థాలతో నెల్లూరుకు బొలెరో వాహనం వెళుతోంది. ఖాజీపేట మండలం బోసిరెడ్డిపల్లె సమీపంలోని ప్రధాన రహదారి వద్దకు రాగానే ఆగి ఉన్న ఇసుక ట్రాక్టర్‌ను గురువారం తెల్లవారు జామున బొలెరో వాహనం ఢీ కొంది. వాహనంలో డ్రైవర్‌తోపాటు ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. అందులో బత్తిన హరికృష్ణ(26) అక్కడికక్కడే మృతి చెందగా వీరన్నతోపాటు మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. మృతి చెందిన వ్యక్తి నంద్యాల జిల్లా గడివేముల మండలం పెద్ద చింతకుంట గ్రామానికి చెందిన వాసిగా తెలిసింది. పోలీసులు మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

12 నుంచి గ్రామీణ క్రీడలు



కరపత్రాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

కోడుమూరు రూరల్: కోడుమూరులో ఫిబ్రవరి 10వ తేదీ నుంచి జరగనున్న చౌడేశ్వరీదేవి తిరునాలను పురస్కరించుకుని ఫిబ్రవరి 12,13,14వ తేదీల్లో గ్రామీణ క్రీడలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక సంతమార్కెట్‌లో శ్రీచౌడేశ్వరీదేవి తిరునాల క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాల కరపత్రాలను విడుదల చేశారు. ఫిబ్రవరి 12,13, 14వ తేదీల్లో క్రికెట్, స్లోసైకిల్, చదరంగం, కబడ్డీ, వ్యాసరచన, షెటిల్, గోనె సంచితో పరుగెత్తడం, పొట్టేళ్ల పోటీ, మహిళలు, పురుషుల విభాగంలో వేర్వేరుగా వాలీబాల్ పోటీలు, రుచితిండి వీరుల పోటీ, తప్పెట, మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీలు, డాన్స్ బేబీ డాన్స్ పోటీలను నిర్వహించి దాతల సహకారంతో నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు కమిటీ సభ్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లాయర్ ప్రభాకర్, ఆంధ్రయ్య, దయాకర్, ఏకాంబరం, దీప్తి రాజు, క్రిష్ణయ్య, రాముడు, జయన్న, కిరణ్, ప్రతాప్‌రెడ్డి, నటరాజ్, ఈరన్న, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనాన్ని వ్యతిరేకిస్తున్నాం



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు

గడివేముల: ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని, అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలోని 6, 7, 8 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి అన్నారు. గురువారం గడివేములలో జరిగిన ఏపీటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల పేరుతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతుల విలీనాన్ని నిలుపుదల చేయాలని, అలాగే నిబంధనల మేరకు 6,7,8 తరగతులు కలిపి 60 మందికి పైగా విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించాలని అయితే నిబంధనలకు వ్యతిరేకంగా మౌలిక వసతులు లేవనే నెపంతో 3 నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం దుర్మార్గమైన చర్యన్నారు. వాటిని ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించాలని లేనిపక్షంలో అలాగే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులకు భిన్నంగా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎక్కువ పాఠశాలలను విలీనం చేయాలని కిందిస్థాయి అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. ప్రతి తరగతికి 45 మంది విద్యార్థులు దాటితే రెండో సెక్షన్ కేటాయించాలని.. అలాగే ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియం, మైనర్ మీడియంలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా మహిళా కార్యదర్శి కవిత, గడివేముల మండల శాఖ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలస్వామి, నాయకులు రాంపుల్లారెడ్డి, శ్రీరాములు, మారెన్న, మహబూబ్ బాషా, నాగన్న, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఆదిశేషమ్మ, కోమలమ్మ, లక్ష్మీదేవి, లలితమ్మ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు

కోడుమూరు రూరల్: ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న రుణాలకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 7లోగా బీసీ కులాలకు చెందిన లబ్ధిదారులు ఓబీఎంఎంఎస్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాని సూచించారు.

ఎవరెటుపోతే నాకేంటి!



పాత ఈద్గా వద్ద రోడ్డు మధ్యలో నిలిపిన లారీ

కర్నూలు న్యూసిటీ: నగరంలోని పాత ఈద్గా ముందు కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. ఎల్లప్పుడూ కిక్కిరిసి ఉండే ఈ ప్రాంతంలో ఒక్క వాహనం కొద్దిగా ఆలస్యంగా కదిలినా తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు ప్రమాదాలు జరిగే ప్రమాదాలు అధికం . అలాంటి ఈ ప్రాంతంలో రైల్వేస్టేషన్ నుంచి ఎరువులను గోడౌన్‌కు తరలిస్తున్న ఒక లారీ డ్రైవర్ రోడ్డు మధ్యలో లారీని ఆపేశాడు. ట్రాఫిక్‌లో ఇతర వాహనదారుల ఇబ్బందులను పట్టించుకోకుండా లారీలో లోడ్ చేసిన ఎరువుల సంచులను జారిపోకుండా సర్దుకుంటున్నాడు. దీంతో ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ లారీ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో లారీని ముందుకు తీసుకెళ్లి రోడ్డు పక్కన ఆపుకుని బస్తాలను సర్దుకుని వెళ్లిపోయారు. తర్వాత రాకపోకలు సజావుగా సాగాయి.

లారీలకు ప్రత్యామ్నాయ దారిని చూపండి

గూడ్స్ రైళ్ల ద్వారా రైల్వేస్టేషన్‌కు వచ్చే ఎరువులు, బియ్యం బస్తాలు ఇతర సరుకులను లారీలలో గోడౌన్‌లకు తరలిస్తుంటారు. అసలే కిక్కిరిసి ఉండే ఈ రహదారిపై సరుకుల లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో లారీలను ఈ మార్గంలో గాకుండా వెంకటరమణ కాలనీ వైపుగా నడిపేలా చర్యలు తీసుకుంటే ట్రాఫిక్ సమస్యకు కొంత ఉపశమనం కలుగుతుందని నగరవాసులు పేర్కొంటున్నారు.

మరమ్మతులు చేసేదెవరు..?



నిరుపయోగంగా ఉన్న చేతి బోరు

గడివేముల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొద్ది నెలల నుంచి చేతి బోరు పనిచేయడం లేదు. నిత్యం వందలాది రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. బోరింగ్ ద్వారా నీరు పట్టుకుంటుంటారు. పనిచేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చేతి బోరుకు మరమ్మతులు చేయించి తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సప్లయర్స్ దుకాణంలో అగ్నిప్రమాదం

కర్నూలు: కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన సప్లయర్స్ దుకాణంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుని భారీ మొత్తంలో షామియానాలు, కుర్చీలు కాలి బూడిదయ్యాయి. సప్లయర్స్ దుకాణం వెనుకనే పెద్ద చెత్త దిబ్బ ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడంతో గురువారం ఉదయం ఆ దిబ్బలో మంటలు చెలరేగి సప్లయర్ దుకాణంలోకి వ్యాపించాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కర్నూలు అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన వాహనంతో అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు. రూ.లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లినట్లు దుకాణ యజమాని రవికుమార్ ఫిర్యాదు చేశారు.

మార్షల్ ఆర్ట్స్‌లో మహిళలు రాణించాలి

కర్నూలు (టౌన్): కరాటే, ఉషూ లాంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడల్లో మహిళలు రాణించాలని కె.వి.ఆర్. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్ సూచించారు. గురువారం స్థానిక కె.వి.ఆర్. మహిళా డిగ్రీ కళాశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా అభ్యాసన చేస్తే క్రీడల్లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థినులకు ఉషూ బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి బెల్టులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

లిఫ్ట్ ప్రమాదంలో వ్యక్తి మృతి

కర్నూలు: కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని ఎలుకూరు ఎస్టేట్‌లో జరిగిన లిఫ్ట్ ప్రమాదంలో ఒకరు మరణించారు. 19వ వార్డులో ఉన్న ఎలుకూరు ఎస్టేట్‌లో కలెక్టర్ రిటైర్డ్ డ్రైవర్ శ్రీరాములుకు చెందిన మూడు అంతస్తుల భవనానికి ఏర్పాటు చేసిన లిఫ్ట్ రిపేరు కావడంతో నిలిచిపోయింది. రిపేర్ చేసేందుకు హైదరాబాదులో స్థిరపడిన కేరళ నివాసి సీనియర్ లిఫ్ట్ టెక్నీషియన్ వినోద్ అలియాస్ జాన్సన్ అనే వ్యక్తి డేవిడ్, సాయి అనే హెల్పర్లతో కలసి వచ్చాడు. లిఫ్ట్ రిపేర్ చేస్తుండగా లిఫ్ట్ జారి పడడంతో కింద ఉన్న సీనియర్ టెక్నీషియన్ వినోద్ అక్కడికక్కడే మరణించాడు. హెల్పర్లు ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ విషయం కేరళ సీపీఎం నాయకుల దృష్టికి పోవడంతో వారు వెంటనే ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్‌కు ఫోన్‌లో సమాచారం చేరవేశారు. ఆయన సూచన మేరకు ఆ పార్టీ నాయకులు రాముడు, నరసింహులు, రాధాకృష్ణ, మాలిక్ తదితరులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదంలో మరణించిన వినోద్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బస్తిపాడు సమీపంలో దెబ్బతిన్న బ్రిడ్జి

ఆదమరిస్తే అంతే!

ఈ చిత్రంలో కనిపిస్తున్నది మండల పరిధిలోని బస్తిపాడు గ్రామ సమీపంలోని వంక దగ్గర ఉన్న బ్రిడ్జి. బ్రిడ్జి దెబ్బతిని ప్రమాదకరంగా మారడంతో రోడ్డు పక్కన సూచికగా రైతులు రాళ్లను ఏర్పాటు చేశారు. ఈ రోడ్డుపై నిత్యం అనుగొండ, రెమడూరు, పుసులూరు, బొల్లవరం , బస్తిపాడు గ్రామాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. కొన్ని వందల వాహనలు రోడ్డుపై తిరుగుతుంటాయి. అలాగే బస్తిపాడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు, రైతులు తమ పంటల దిగబడులు, పొలాలకు ఎరువులు, మందులను తీసుకుని బైక్‌లు, ఆటోలు, ట్రాక్టర్, ఎద్దుల బండ్లపై ఈ రోడ్డుపైన ప్రయాణిస్తుంటారు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

– కల్లూరు